

### మా బాధ్యత కాదంటూ..

రెవెన్యూ అధికారులు సర్వే చేయడం లేదని జలవనరుల శాఖ, ఆక్రమణలను పంచాయతీ తొలగించడం లేదంటూ రెవెన్యూ శాఖ, సాగునీటి వనరులను కాపాడేందుకు జలవనరుల శాఖ ప్రయత్నం చేయడం లేదని మిగిలిన రెండు శాఖలు ఎవరికి వారే కొత్త బాష్యాలను చెబుతున్నారు. అక్రమణలను తొలగించేందుకు, వాల్టా చట్ట ప్రకారం చర్యలు తీసుకొనేందుకు మాత్రం ఇష్టం పడడం లేదు. దీంతో చెరువులు, బందలు, గెడ్డలు, వాగుల కుచించుకుపోతున్నాయి. కొన్నిచోట్ల ఆనవాళ్ల లేకుండా పోతున్నాయి.



● శృంగవరపుకోట మండలం ముషిడిపల్లి గ్రామ పరిధిలో ఓ లేఅవుట్ మధ్య కనిపిస్తున్న సాగునీటి బంద ఇది. దీన్ని కొద్దికొద్దిగా పూడ్చడంతో కుచించుకుపోయింది. వాన నీరు ఇందులోకి పారేందుకు ఉన్న కాలువల ఆనవాళ్లనూ మార్చేశారు.



● కొత్తవలస మండలం కంటకాపల్లి గ్రామ శివారు నరసరాజు చెరువు స్థలంలో నిర్మిస్తున్న రోడ్డు ఇది. ఉపాధి హామీ పథకం నిధులు రూ.50లక్షలతో ఈ రోడ్డును చేపడుతుండడం గమనార్హం. కొత్తసుంకరపాలెం శివారు దత్తిదనన్నపేట ప్రజలకు ఉపయోగపడుతుందని పైకి చెబుతున్నప్పటికీ ఓ ప్రైవేటు పరిశ్రమ, మరో లేఅవుట్ యాజమాన్యానికి లబ్ధి చేకూర్చేందుకే అన్నది బహిరంగ రహస్యం.

# తెలిసినా తెలియనట్టు!

● చెరువు స్థలాల్లో రహదారులు, లేఅవుట్‌లు
● జిరాయితీ భూముల్లో కలిసిపోతున్న గెడ్డలు
● ఆక్రమణలను పట్టించుకోని అధికారులు



శృంగవరపుకోట, మే 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వృద్ధి రేటును ఆకాంక్షిస్తోంది. ఆర్థిక పురోగతికి జిల్లాలో వ్యవసాయ రంగాన్ని నమ్ముకుంది. ఈ రంగం ముందుకు సాగాలంటే సాగునీటి లభ్యత కీలకం. కానీ సాగుకు నీరందించే వనరులు గతి తప్పాయి. వాటిని ఇష్టారాజ్యంగా ఆక్రమిస్తున్నారు. అడ్డుకట్ట వేయాల్సిన యంత్రాంగం చూసినా చూడనట్టు, తెలిసినా తెలియనట్టు నటిస్తున్నారు. ఇటీవల కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత సమక్షంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సాగునీటి వనరుల ఆక్రమణల గురించి చర్చించారు. వీటిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. కీలక అధికారులంతా అక్కడే ఉన్నారు. ఇదిలా ఉండగా వేపాడ మండల కేంద్రానికి వెళ్లే రహదారి పక్కన ఓ బందను కప్పేందుకు మట్టిని వేసేసారు. కిందనున్న ఆయకట్టుదారులు స్థానిక రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో పాటు గ్రీవెన్స్‌లోనూ ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు ఎటువంటి చర్యలకు పూనుకోలేదు. బందలో మట్టేసిన వారికి అనుకూలంగా గ్రామ స్థాయి అధికారొకరు మాట్లాడుతుండడం ఆయకట్టుదారుల్లో ఆందోళన కలిగిస్తోంది. జలవనరుల శాఖ బంద సర్వేకు తహసీల్దార్ కార్యాలయానికి లేఖ పంపించి చేతులు దులుపుకుంది. ఇలా జిల్లా వ్యాప్తంగా సాగునీటి వనరులను కప్పేస్తున్నట్లు తెలిసిన అధికారులు ఒకరిపై ఒకరు నెపం పెట్టుకుంటూ తప్పించుకుతిరుగుతున్నారు.

**సాగునీటి వనరులే ఆధారం**

జిల్లా 60 శాతం వర్షాధార ప్రాంతం. జూన్‌లో (మిగతా 8వ పేజీలో..)

వ్యవసాయ రంగం ద్వారానే జిల్లాలో వృద్ధి శాతం పెంచేందుకు అవకాశం ఉంది. దాదాపు మూడు లక్షల ఎకరాల సాగు భూమి అందుబాటులో ఉంది. లక్షా ఇరవై మూడు ఎకరాల్లో మాత్రమే పంటలు పండిస్తున్నారు. మిగతా భూమిని వినియోగంలోకి తీసుకువస్తే 15శాతం కంటే ఎక్కువ వార్షిక వృద్ధి రేటు సాధించగలం.

**- ఎస్.కోట నియోజకవర్గ సమీక్షలో సిబ్బందికి కలెక్టర్ అంబేడ్కర్ ఇటీవల ఇచ్చిన సూచన**



● వేపాడ మండలం కొండగంగుబూడి పంచాయతీ శివారు ఎస్‌కేఎస్ పురం గ్రామ పరిధిలోని గెడ్డ ఇది. దీని పక్కనున్న భూ యజమాని గెడ్డను కప్పేస్తున్నాడు. దీంతో చాలా వరకు కుచించుకుపోయింది. గెడ్డ నుంచి వరద నీరు పారేందుకు చిన్నగా పైపులు వేసే ప్రయత్నంలో ఉన్నాడు. ఈ ఆక్రమణ అధికారులెవరికీ కనిపించడం లేదు. ఈ గెడ్డ నుంచి వరద నీరు విజయరామసాగర్‌తో పాటు అనేక గొలుసు చెరువులను నింపుతుంది.

# లోతుగా ఎన్ఐఏ దర్యాప్తు!

**● కస్టడీ పిటిషన్‌పై తీర్పును రిజర్వులో ఉంచిన న్యాయాధికారి**

విజయనగరం/క్రైం, మే 20(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాద సానుభూతి పరులైన విజయనగరానికి చెందిన సిరాజ్ ఉర్ రెహ్మాన్, హైదరాబాద్‌కు చెందిన్ సయ్యద్ సమీర్ కార్యకలాపాలపై ఎన్ఐఏ అధికారులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. అన్ని కోణాల్లో ఆరా తీస్తున్నారు. విజయనగరం పోలీసుల సహకారంతో సమాచారాన్ని క్రోడీకరిస్తున్నారు. మరోవైపు నిందితుల కస్టడీ కోరుతూ పోలీసులు కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై తీర్పును న్యాయాధికారి రిజర్వులో ఉంచారు.

ఎన్ఐఏ అధికారులు రెండు రోజులుగా విజయనగరంలోనే ఉంటూ విచారిస్తున్నారు. సిరాజ్ సమీప బంధువులు, కుటుంబ సభ్యులు, అతని బ్యాంక్ ఖాతాల లావాదేవీలతో పాటు సిరాజ్ వినియోగించే సెల్‌ఫోన్ ఆధారంగా ఏయే నెంబర్లు వినియోగించారు...ఎవరెవరితో మాట్లాడుతున్నారు తదితర విషయాలను మంగళవారం నమోదు చేసుకున్నారు. సిరాజ్ కుటుంబం నివాసం ఉండే ఆబాద్‌వీధి, సిరాజ్ ప్రత్యేకంగా ఉంటున్న బాబామెట్టలోని ఆయన ఇంటిని మరోసారి పరిశీలించినట్లు సమాచారం. సిరాజ్‌కు 10 బ్యాంక్ అకౌంట్‌లు ఉన్నట్లు బోగట్టా. వీటిలో విజయనగరంలోని డీసీసీబీ ఖాతా, అతని తండ్రి పేరుమీద ఉన్న లాకర్ గురించి పోలీసులు ఇప్పటికే ఆరా తీశారు. ముఖ్యంగా ఆర్థిక మూలాలను శోధిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే హైదరాబాద్‌కు చెందిన సయ్యాద్ సమీర్ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో ఆర్థిక లావాదేవీలు, మొబైల్ కాంట్రాక్ట్ నెంబర్లపై ఓ స్పష్టతకు వచ్చినట్లు సమాచారం. సిరాజ్ ఉర్ రెహ్మాన్, సయ్యద్ సమీర్‌ల నుంచి మరింత సమాచారం రాబట్టేందుకు వారిని పోలీస్ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయాధికారి మంగళవారం వాదనలు విన్న తరువాత తీర్పును రిజర్వులో ఉంచారు.




# ఒక్కో పోస్టుకు 31 మంది పోటీ

● జిల్లా వ్యాప్తంగా 583 ఉపాధ్యాయ పోస్టులు
● 18,001 మంది అభ్యర్థులు ● 31,038 దరఖాస్తులు ● మహిళలే అధికం



విజయనగరం: స్టడీ సెంటర్‌లో డీఎస్సీకి సన్నద్ధమవుతున్న అభ్యర్థులు

విజయనగరం కలెక్టరేట్, మే 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టులకు జిల్లా వ్యాప్తంగా పురుషుల కంటే మహిళలే అధికంగా దరఖాస్తు చేసుకున్నారు. డీఎస్సీ నోటిఫికేషన్‌లో ప్రకటించిన 583 పోస్టులకు 18,001 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఒక్కొక్కరూ రెండు లేదా మూడు పోస్టులకు పోటీ పడుతుండడంతో దరఖాస్తుల సంఖ్య 31,038కు పెరిగింది. ఒక్కో ఉపాధ్యాయ ఉద్యోగానికి దాదాపు 31 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత నెల 20న మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. అర్హులైన అభ్యర్థులు ఈనెల 15 వరకు దరఖాస్తు చేసుకున్నారు. మే 30 నుంచి హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జూన్ 6 నుంచి జూలై 6 వరకు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తారు. తరువాత ఫైనల్ కీ విడుదల చేసి, అభ్యంతరాలు స్వీకరించి, మెరిట్ లిస్టు విడుదల చేస్తారు. పరీక్షకు ఇచ్చిన గడువు 90 రోజులకు పెంచాలని కొందరు నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. నార్మలైజేషన్ రద్దు చేసి ఒకే పేపర్ విధానం ఉండాలని ఇంకొందరు కోరుతున్నారు. వైసీపీ హయంలో 2023 అక్టోబరు 3 నుంచి 21 వరకూ టెట్ పరీక్ష నిర్వహించి ఫలితాలు కూడా విడుదల చేశారు. టెట్‌కు జిల్లాలో 22,890 మంది దరఖాస్తు చేసుకోగా 20,354 మంది పరీక్ష రాశారు. 2534 మంది పరీక్ష దూరంగా ఉండిపోయారు. అందులో 50 శాతం మంది అభ్యర్థులు క్వాలిఫై అయ్యారు. కాగా డీఎస్సీ పరీక్షలకు సమయం సమీపిస్తుండడంతో నిరుద్యోగులు రేయింబవళ్లూ పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. కోచింగ్ సెంటర్లు వారితో కళకళలాడుతున్నాయి. ఇళ్ల వద్ద ఉంటూ ఆన్‌లైన్ కోచింగ్ తీసుకుంటూ కూడా చాలా మంది సన్నద్ధం అవుతున్నారు.

# విజయనగరానికి ఉగ్రవాద లింకులా?

● అరాచక వైసీపీ పాలనతోనే సమాజం గాడి తప్పింది
● టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు

ప్రశాంత విజయనగరంలో ఉగ్రవాద లింకులు ఎండడం ఎంతో బాధించిందని, ఐదేళ్ల వైసీపీ అరాచక పాలన వల్లే సమాజం గాడి తప్పిందని కేంద్రమాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు ఆరోపించారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అధ్యక్షతన మంగళవారం విజయనగరంలో జరిగిన మినీ మహానాడులో ఆయన మాట్లాడారు. తొలుత దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన సైనికులకు నివాళులు అర్పించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి కూడా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీని ఉద్దేశించి మాట్లాడుతూ తెలుగుదేశం క్రమశిక్షణ గల పార్టీ అని, ఎంతో మంది నాయకులు, కార్యకర్తలను తయారు చేసిన ఘనత దక్కించుకుందన్నారు.



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న అశోక్‌గజపతిరాజు

7లో **పండుగ వాతావరణంలో..**

● నియోజకవర్గాల్లో మినీ మహానాడు
● వివిధ అంశాలపై నాయకుల తీర్మానాలు

# మహానాడు కమిటీల్లో జిల్లా నేతలకు ప్రాధాన్యం

విజయనగరం, మే 20 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఈ నెల 26 నుంచి రెండు రోజుల పాటు కడపలో జరిపే రాష్ట్రస్థాయి మహానాడుకు నిర్వహణా కమిటీలు ఏర్పాటు చేసింది. వాటిలో జిల్లా నేతలకు సముచిత స్థానాలు కల్పించింది. కమిటీల్లోని నేతలంతా ఈ నెల 24 నుంచే కడపలో ఉండాలి. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, (సాంస్కృతిక కార్యక్రమాల కమిటీ కన్వీనరు), కిమిడి కళా వెంకటరావు (తీర్మానాల కమిటీ సభ్యుడు) విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు (ఫొటో ప్రదర్శన కమిటీ సభ్యుడు), విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు (ప్రతినిధుల నమోదు కమిటీ సభ్యురాలు), కర్రోతు బంగార్రాజు (వాహన పార్కింగ్ కమిటీ సభ్యుడు)కు బాధ్యతలు అప్పగించారు. ఆయా కమిటీ సమావేశాలు విజయవాడలో ఈ నెల 22 నుంచి జరగనున్నాయి. ఈ సమావేశాలకు వెళ్లి ఆయా కమిటీల ద్వారా నిర్వహించాల్సిన పనులను 24 నుంచే పర్యవేక్షించనున్నారు.

# ఆరోగ్య యోగం!

● నేటి నుంచి యోగాంధ్ర ● నెలరోజుల పాటు విస్తృత ప్రచారం
● జూన్ 21న విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

6లో

ఆరోగ్యవంతమైన సమాజానికి యోగ కీలకమని భావించిన రాష్ట్ర ప్రభుత్వం నెలరోజుల పాటు యోగాంధ్ర పేరుతో విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఈ నెల 21న అందుకు శ్రీకారం చుడుతున్నారు. బుధవారం ఉదయం 7 గంటలకు విజయనగరంలోని రాజీవ్ క్రీడా ప్రాంగణంలో యోగాంధ్ర ప్రారంభ సభకు ఏర్పాట్లు చేశారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని నెల రోజులు ముందు నుంచి యోగాపై వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జేసీ సేతు మాధవన్ మంగళవారం తెలిపారు.



# మద్యం మత్తులో హత్య

● కుమరాంలో ఘటన ● నిందితుడు పాత నేరస్థుడే?



సూర్యనారాయణ(ఫైల్)

జామి, మే 20(ఆంధ్రజ్యోతి): ఎస్.కోట నియోజకవర్గంలో మరో హత్య కలకలం సృష్టించింది. మద్యం మత్తులో ఓ వ్యక్తి పారిశుధ్య కార్మికుడిని హత్య చేశాడు. కొద్దిరోజుల క్రితం ఎస్.కోట మండలం చామాలపల్లిలో హత్య జరిగింది. మూడురోజుల క్రితం ఇదే మండలంలోని వెంకటరమణపేటలో వివాహిత హత్య ఉదంతం మరువకముందే జామి మండలంలోని కుమరాం గ్రామంలో తాజాగా ఇదే తరహా ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

కుమారాం గ్రామంలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న ఎద్దు సూర్యనారాయణ(48) ఎప్పటిలాగే మంగళవారం గ్రామంలో పనులు చేసుకుంటూ ఎస్సీకాలనీ రచ్చబండ వద్ద కూర్చున్నాడు. అదే సమయంలో మద్యం మత్తులో ఉన్న గ్రామస్థుడు వంకా రవి అటుగా వస్తూ సూర్యనారాయణతో గొడవ పడ్డాడు. వారి మధ్య మాటమాట పెరిగాక కోపోద్రిక్తుడై మెడపైనా, కాళ్లుచేతులపైనా తీవ్రంగా గాయపరిచాడు. ఆర్తనాథాలు చేస్తూ సూర్యనారాయణ ఇంటికి వెళ్లి విషయం చెప్పాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లామనుకునే సరికి మృతిచెందాడు. సమాచారం అందుకున్న సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ వీరజనార్దన్ గ్రామానికి వచ్చి దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. కాగా నిందితుడిపై ఇప్పటికే పలు పోలీస్ కేసులు ఉన్నాయని స్థానికులు తెలిపారు. పలుమార్లు జైలుకు వెళ్లి వచ్చాడంటున్నారు. సూర్యనారాయణ కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు. నిందితుడు రవిని పోలీసులు ఆదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

# అంబరాన్నంటిన సంబరం

● వైభవంగా శ్యామలాంబ సిరిమానోత్సవం
● రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభం
● జనసంద్రమైన సాలూరు ● విరిగిన అంజలి రథ చక్రం

సాలూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): సాలూరు గ్రామదేవత శ్యామలాంబ అమ్మవారి సిరిమానోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. సాలూరు జనసంద్రంగా మారింది. ఆలయ పూజారి జన్ని ధనుంజయరావు, ఉత్సవ కమిటీ సభ్యులు, అల్లువారి కుటుంబం కలిసి అమ్మవారి ఘటాలకు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. అల్లువారి ఇంటి వద్ద పూజారి సిరిమానును అధిరోహించారు. చిన్నవీధికి చెందిన వారు ఆడవారి వేషంతో అంజలి రథం ఎక్కారు. అమ్మవారి ఘటాలు అంజలి రథం ముందుకు వచ్చిన వెంటనే సిరిమానోత్సవం మొదలైంది. సాయంత్రం 4.30 (మిగతా 8వ పేజీలో..)



# శ్యామలాంబ వైభవం


శ్యామలాంబ ఆలయం ఎదుట కోలాహలం


అంజలి రథంతో భక్తులు


వేపచెట్టు వద్ద మహిళల పూజలు

- సిరిమాను సంబరానికి పోటెత్తిన భక్తజనం

సాలూరు ఇలవేల్పు శ్యామలాంబ అమ్మవారి సిరిమాను సంబరం అంబరాన్ని తాకింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఛత్తీస్‌ఘడ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో ఉత్సవానికి తరలివచ్చారు. భక్తజనంతో సాలూరు కిక్కిరిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

-సాలూరు, మే 20 (ఆంధ్రజ్యోతి)


ఉత్సవాల్లో థింసా నృత్యం


అమ్మవారి ఆలయంలో దర్శనానికి...


శ్యామలాంబ ప్రతిమకు పూజలు


సిరిమాను ఉత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో పైడితల్లి

## పైడిమాంబకు ప్రత్యేక పూజలు

విజయనగరం రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడిమాంబ ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైల్వేస్టేషన్ వద్ద ఉన్న వనంగుడి, మూడులాంతర్లు వద్ద ఉన్న చదురుగుడుల్లో వివిధ రకాల పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ రకాల పండ్లను, పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. వైశాఖ మాసం కావ డంతో భక్తులు అధిక సంఖ్యలో పైడిమాంబను దర్శించుకున్నారు. మంగళవా రం ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం చేశారు. చదురుగుడి పక్కన ఉన్న కళావేదిక వద్ద ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేసిన శ్యామ్ మేజిక్ షో ఆకట్టుకుంది.

## ఘనంగా పైడితల్లమ్మ ఉత్సవాలు


ఆకట్టుకున్న భద్రకాళి వేషం


పులివేషాలు

వేపాడ, మే 20 (ఆంధ్ర జ్యోతి): వల్లంపూడి గ్రామ దేవత పైడితల్లమ్మ పండుగను మంగళవారం వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పులివేషాలు, బండ్ల వేషాలు, నేల డ్యాన్స్‌లు, కోలాటాలు, బిందెల డ్యాన్స్‌లు ఆకట్టుకున్నాయి. సాయంత్రం సినీ, టీవీ నటులతో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా వల్లంపూడి ఎస్‌ఐ సుదర్శన్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.


ఉత్సవాలకు హాజరైన జనం


మాట్లాడుతున్న డ్వామా పీడీ శారదాదేవి

## ఇంకుడు గుంతల ప్రాధాన్యాన్ని తెలపండి

- డ్వామా పీడీ శారదాదేవి

రేగిడి, మే 20 (ఆంధ్రజ్యోతి): ఇంకుడు గుంతలు, ఫాంపాండ్స్, వర్మీ కంపోస్టు ప్రాధాన్యాన్ని రైతులకు తెలియజేసి, తద్వారా లక్ష్యాలను చేరుకోవాలని ఏపీవో హరనాథ్‌ను డ్వామా పీడీ శారదాదేవి ఆదేశించారు. మంగళవారం ఆమె స్థానిక ఉపాధి కార్యాలయాన్ని సందర్శించారు. ఉపాధి ప్రగతి, వివిధ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. మండలంలో ఈ ఏడాది ఫాంపాండ్స్ లక్ష్యం 220 కాగా... ఇప్పటి వరకూ 21 పూర్తయినట్టు తెలుసుకున్నారు. ఇంకుడు గుంతలు శతశాతం తవ్వకపోవడంతో ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. పనితీరు మెరుగుపరచుకోవాలని సూచించారు. కొత్తగా మంజూరైన కంపోస్ట్ పిట్స్ ప్రతి పంచాయతీకి 30కి తక్కువ లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సత్యనారాయణ, ఈసీ శ్రీనివాస్, టీఏలు పాల్గొన్నారు.

# ఆరోగ్య యోగం

- నేటి నుంచి యోగాంధ్ర
- నెలరోజుల పాటు విస్తృత ప్రచారం
- జూన్ 21న విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవం


ధ్యాన ముద్రలో...

రాజాం రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి)

యోగా.. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషించే ఆయుధం. దీని వల్లనే వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ యోగాపై మక్కువ చూపుతున్నారు. దీనికోసం కొంత సమయాన్ని కేటాయిస్తున్నారు. ఫలితంగా యోగా కేంద్రాలు, శిక్షకుల సంఖ్య కూడా పెరుగుతోంది. రోగాలను రూపుమాపే అద్భుతమైన శక్తి యోగాకు ఉందని ప్రపంచ వ్యాప్తంగా నమ్ముతున్నారు. దీర్ఘకాలిక రోగాలు తగ్గుతున్నాయన్న ప్రచారం కూడా ఉంది. మొత్తమ్మీద మన జీవితంలో ఇది ఇప్పుడు భాగమైంది.

### నేటి నుంచి నెల రోజుల పాటు..

జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల రోజుల పాటు యోగాంధ్ర పేరుతో రాష్ట్రంలో విస్తృత ప్రచారం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఈ నెల 19న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ జిల్లా కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో రెండు కోట్ల మందిని భాగస్వాములను చేయాలని ఆయన కలెక్టర్లకు సూచించారు. వచ్చే నెల 21న విశాఖలోని ఆర్‌కే బీచ్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రత్యక్షంగా అయిదు లక్షల మంది పాల్గొనేలా ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామంలోనూ యోగా దినోత్సవాన్ని నిర్వహించాలని ప్రభుత్వం పిలుపునిచ్చింది. యోగా ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించే బాధ్యతను కలెక్టర్లకు అప్పగించింది.

### పెరిగిన ప్రాధాన్యం..

యాంత్రిక జీవనం, ఒత్తిడి, వేగంతో కూడిన ఆధునిక సమాజంలో యోగా ప్రాధాన్యం పెరిగింది. నగరాలను దాటి పల్లెలనూ పలకరిస్తోంది యోగా. మనస్సు, శరీరం, ఆత్మ, పరమాత్మల కలయికే యోగా అని చెప్పవచ్చును అంటున్నారు రాజాంకు చెందిన యోగా గురువు టీటీవీ రమణమూర్తి. జిల్లా అంతటా యోగాను అభ్యసిస్తున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంది. వైద్య నిపుణులు కూడా యోగా చేయాలని సూచిస్తున్నారు.

### యోగా నియమాలు ఇలా..

- సాధకులు విధిగా ప్రార్థనతో ప్రారంభించి... ప్రార్థనతోనే ముగించాలి.
- ఆసనాలు వేసే ముందు నీరు తాగాలి.
- ఆదుర్దా, ఆందోళన, ఆకలి, అలసట ఉన్నపుడు యోగాకు దూరంగా ఉండాలి.
- యోగాసనాలు వేసే ముందు చన్నీళ్లతో స్నానం చేయడం వల్ల ప్రయోజనం ఉంటుంది.
- తేలికైన వస్త్రాలు ధరించాలి.
- స్త్రీలు రుతు సమయంలో ఆసనాలు వేయకూడదు..
- గర్భిణులు శిక్షకుల పర్యవేక్షణలో మొదటి మూడు నెలలు ఆసనాలు వెయ్యొచ్చు.

### ఆసనాలు.. ప్రయోజనాలు

**భుజంగాసనం**

పాము పడగ ఎత్తినట్లు ఆకారం కలిగిన ఈ ఆసనం వేయడం వల్ల ఛాతిభాగం విప్పారుతుంది. ఊపిరితిత్తులు బలపడతాయి. వెన్ను దృఢంగా ఉంటుంది. నడుం నొప్పి తగ్గుతుంది.

**ధనురాసనం**

ధనుస్సును పోలిన ఈ ఆసనం ఎత్తు పెరిగేందుకు తోడ్పడుతుంది. కీళ్ల సంబంధ వ్యాధులు తగ్గుతాయి. మలబద్ధకం పోతుంది. షుగర్ తగ్గుతుంది.

**పశ్చిమోత్తాన ఆసనం**

ఈ ఆసనం ద్వారా పొట్ట సంబంధ వ్యాధులు తగ్గుతాయి. జననాంగాలకు వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుంది.

**ఉష్ట్రాసనం**

ఒంటె ఆకారాన్ని పోలిన ఈ ఆసనం వల్ల నడుం నొప్పి తగ్గి, వెన్ను సామర్థ్యం పెరుగుతుంది. సర్వైకల్ స్పాండిలైటిస్‌తో బాధపడే వారికి ఈ ఆసనం ఎంతో ఉపయోగపడుతుంది.

**శవాసనం**

దీనిని అమృతాసనం అనికూడా పిలుస్తారు. ఆసనాల ప్రారంభంలోనూ, మధ్యలోనూ, పూర్తయిన తరువాత కూడా దీనిని వేసుకోవాలి. దీనివల్ల శరీరానికి విశ్రాంతి లభిస్తుంది. మానసిక ఒత్తిడి తగ్గుతుంది. అన్ని వయస్సుల వారూ దీనిని ఆచరించవచ్చును.

**శశాంకాసనం...**

చంద్రుని ముఖం వలె ప్రకాశించే రూపును కలిగించే ఈ ఆసనంతో తలనొప్పి, ఒత్తిడి తగ్గుతుంది. ఊపిరితిత్తులకు ప్రాణవాయువు అందజేస్తుంది. చిరాకు, కోపం వంటివి మెల్లగా తగ్గుముఖం పడతాయి.

### ప్రభుత్వ నిర్ణయం ప్రశంసనీయం



యోగా ప్రాధాన్యాన్ని తెలియజెప్పేందుకు యోగాంధ్ర పేరుతో నెలరోజుల పాటు విస్తృత ప్రచారం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం ప్రశంసనీయం. యోగాభ్యాసంతో షుగర్, బీపీ, ఆస్తమా వంటి దీర్ఘకాలిక రోగాలు తగ్గుముఖం పడతాయి. ప్రాణాయామం వల్ల మనిషి శారీరక, మానసిక ప్రవర్తనలో స్పష్టమైన మార్పు కనిపిస్తుంది. ఆలోచించే శక్తి, క్షమించే గుణం పెరుగుతుంది. దూకుడుతనం తగ్గి ప్రేమించే మనస్తత్వం పెరుగుతుంది. మహిళల్లో ఇంకా చైతన్యం రావాలి. వ్యాధులతో సతమతమవుతూ అవస్థలు పడుతున్న వారికి యోగాభ్యాసం ఉపశమనం కలిగిస్తుంది.

-టీటీవీ రమణమూర్తి, యోగా గురువు, రాజాం


యోగా చేస్తున్న విద్యార్థినులు


మాట్లాడుతున్న జేసీ సేతుమాధవన్

## యోగాంధ్ర విజయవంతానికి కృషి

- జేసీ సేతుమాధవన్

విజయనగరం కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నెల రోజుల ముందు నుంచే వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జేసీ సేతు మాధవన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి మండల, గ్రామ స్థాయి అధికారులతో జేసీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 21న ప్రధాని మోదీ విశాఖపట్టణంలో ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం జరుగుతుందన్నారు. ఈ నెల 21 నుంచి యోగా చేయడంపై ప్రజల్లో చైతన్యం తీసుకుని రావాలని సూచించారు. ప్రతి ఒక్కరూ యోగాభ్యాసంలో పాల్గొనేలా చేయాలన్నారు. ముందుగా మండలానికి ఇద్దరేసి యోగా శిక్షకులను గుర్తించి వారి ద్వారా టీవోటీ కోసం ప్రతి గ్రామం, వార్డు నుంచి ఒకరు చొప్పున ఎంపిక చేసి ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పంపాలన్నారు. వచ్చే నెల 18, 19 తేదీలలో గ్రామ, మండల, జిల్లా స్థాయిలలో యోగా పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ నెల 21న ఉదయం 7 గంటలకు రాజీవ్ క్రీడా ప్రాంగణంలో కర్టెన్ రైజర్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, డీఈవో మాణిక్యం నాయుడు, డీఎస్‌వో మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

# పండుగ వాతావరణంలో..

**● నియోజకవర్గాల్లో మినీ మహానాడు ● వివిధ అంశాలపై నాయకుల తీర్మానాలు**

## అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

విజయనగరం రూరల్, మే 20 ( ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం టీడీపీకి రెండు కళ్ల లాంటివని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో విజయనగరంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించినట్టు ఆమె చెప్పారు. మంగళవారం సాయంత్రం ఆమె అధ్యక్షతన నగరంలోని మెసానిక్ టెంపుల్‌లో మినీ మహానాడు నిర్వహించారు. ఏడాది కాలంలో విజయనగరంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఫొటో ఎగ్జిబిషన్‌ను కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదితి మాట్లాడుతూ మినీ మహానాడులో చేసిన తీర్మానాలను మహానాడుకు నివేదించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పిల్లా విజయకుమార్, అవనాపు విజయ్ తదితరులు పాల్గొన్నారు. ●విజయనగరంలోని ఐస్‌ఫ్యాక్టరీ జంక్షన్ నుంచి అయినాడ జంక్షన్ వరకూ గతంలో టీడీపీ ప్రభుత్వం రహదారి విస్తరణ పనులకు చర్యలు చేపట్టిందని, ఆ పనులను తిరిగి ప్రారంభించాలని తీర్మానం చేశారు విజయనగరం మండల పరిధిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసిన వేణుగోపాలపురం వద్ద 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను ప్రారంభించాలని తీర్మానించారు. విజయనగరంలో ప్రస్తుతం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

ఉన్న డిగ్రీ కళాశాలను సంస్కృత కళాశాలలో నిర్వహిస్తున్న నేపథ్యంలో శాశ్వత భవనం మంజూరు చేయాలని తీర్మానం చేశారు. వీటితో పాటు నదుల అనుసంధానం, పెద్ద చెరువు మురుగునీటి శుద్ధి కర్మాగారం పెండింగ్ పనులు పూర్తి చేయాలని మినీ మహానాడులో తీర్మానించారు.

## రాష్ట్రాన్ని జగన్ నాశనం చేశారు: కళా

గరివిడి, మే 20 ( ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో మాజీ ముఖ్యమంత్రి జగన్ నాశనం చేశారని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. మంగళవారం గరివిడిలో నిర్వహించిన మినీ మహానాడులో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధితో పాటు, సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. డీసీసీబీ ఛైర్మన్ కిమిడి నాగార్జున మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడూ జరిగినా అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గద్దె బాబురావు, టీడీపీ నాయకులు మల్లిక్‌నాయుడు, త్రిమూర్తుల రాజుతో పాటు నాలుగు మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

## నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

రాజాం, మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక చీపురుపల్లి రోడ్డులోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో మంగళవారం మినీ మహానాడు పండుగ వాతావరణంలో నిర్వహించారు. ముందుగా టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, ఎమ్మెల్యే గ్రీష్మ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పలు తీర్మానాలు చేశారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పీజీ సెంటర్, విజయనగరం నుంచి రాజాం మీదగా పాలకొండకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణం, చిలకపాలెం నుంచి రాజాం మీదగా రామభద్రపురం వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణంపై తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో



పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కోండ్రు

పట్టణ పార్టీ అధ్యక్షుడు నంది సూర్యప్రకాశరావు, టీడీపీ నాయకులు కోండ్రు జగదీశ్, బొత్స వాసుదేవరావు నాయుడు. సుమల వెంకట మన్మథరావు. పిన్నింటి మోహనరావు. కిమిడి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

## రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు



మాట్లాడుతున్న బంగార్రాజు

పూసపాటిరేగ, మే20 (ఆంధ్రజ్యోతి): కొత్త ప్రభుత్వం ఏర్పాటైన ఏడాది కాలంలోనే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు మంగళవారం పూసపాటిరేగలో నియోజవర్గస్థాయి మహానాడు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై తొలుత టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆపరేషన్ సిందూర్‌లో వీర మరణం పొందిన జవాన్ల ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాల మౌనం పాటించారు. అనంతరం బంగార్రాజు మాట్లాడుతూ ఈనెల 27 నుంచి 29 వరకూ కడప జిల్లాలో నిర్వహించనున్న మహానాడును అందరూ విజయవంతం చేయాలన్నారు. మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలకు పెద్దపీట వేసిందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శి పతివాడ తమ్మినాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పతివాడ అప్పలనారాయణ, పూసపాటిరేగ మండల అధ్యక్షుడు మహంతి శంకరరావు, కర్రోతు సత్యనారాయణ, పల్లె భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకే తొలిప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట, మే 20 (ఆంధ్రజ్యోతి): పార్టీ అధికారంలో ఉన్నా, లేకపోయినా కార్యకర్తలకే తమకు తొలి ప్రాధాన్యమని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మంగళవారం లక్కవరపుకోటలో మినీ మహానాడు ఘనంగా నిర్వహించారు. అధికారం చేపట్టిన తర్వాత పార్టీ తీసుకున్న నిర్ణయాలను అందరూ ఆమోదించారు. ఇటీవల ఉగ్రదాడిలో మృతి చెందినవారు, రోడ్డు ప్రమాదాల్లో మరణించిన పార్టీ కార్యకర్తలకు సంతాపం తెలిపారు. పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై చర్చించి ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ ఇందుకూరి సుధారాణి, కె.బి.ఎ.రాంప్రసాద్, ఐదు మండలాల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

### ఐసెట్ ఫలితాల విడుదల

విజయనగరం కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఐసెట్ ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈ నెల7న ఎంబీఏ, ఎంసీఏలో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షలో జిల్లావ్యాప్తంగా 1549 మంది పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. 1407 మంది పరీక్షకు హాజరు కాగా 1378 మంది ఉత్తీర్ణత సాధించారు.

### ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోండి

వేపాడ, మే20 (ఆంధ్రజ్యోతి): మారిక గ్రామాన్ని అదానీ కంపెనీకి అప్పగించాలనుకుంటే ప్రజాభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని గిరిజనులతో కలిసి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ డిమాండ్ చేశారు. గిరిజన సంస్కృతిని కాపాడాలని, మారిక గ్రామాన్ని అదానీకి అప్పగించవద్దని కోరుతూ మంగళవారం జాకేరు గ్రామ సచివాలయం ఎదుట వారు ఆందోళన చేపట్టారు. అనంతరం పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు.

### ఘనంగా ఆలయ వార్షికోత్సవం

విజయనగరం రింగురోడ్డు, మే 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రింగురోడ్డు ఎస్‌వీఎన్ నగర్‌లో గల జ్ఞానసరస్వతి ఆలయం వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. ఆలయ ప్రాంగణంలో ఆదినారాయణ స్మారక కళాపీఠం వారిచే గంటా లక్ష్మీ సినీ ఆర్కెస్ట్రా జరిగింది. 21న బుధవారం విద్యార్థుల గోత్ర నామాలతో సరస్వతి హోమాన్ని నిర్వహించనున్నట్టు శారద సేవాసంఘం అధ్యక్షుడు గుడిసె శివకుమార్ తెలిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు చెరుకూరి శ్రీధర్, శివ, ఆలయ ప్రధాన అర్చకుడు తాతాచార్యులు పాల్గొన్నారు.

### అభిమానుల రక్తదానం

విజయనగరం రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆయన అభిమానులు స్థానిక బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేశారు. రక్తదాన శిబిరాన్ని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా నందమూరి అభిమాన సంఘం గౌరవ అధ్యక్షుడు ఐవీపీ రాజు, అభిమాన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాగిత శ్రీనివాస్ యాదవ్, కనకల మన్మథ ప్రారంభించారు. రక్తదానం చేసిన వారిలో అభిమాన సంఘం ప్రతినిధులు యోగేష్ యాదవ్, తులసీరామ్, పిన్నింటి హరి, శివకళ్యాణ్, బి.నారాయణరావు, వెంకటేశ్, హరీష్, ప్రసాద్, సురేష్ ఉన్నారు.

### సమస్యలను పరిష్కరించండి

రాజాం రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రాజాం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. పలువురు కార్మికులతో కలిసి మున్సిపల్ కమిషనర్ అప్పలనాయుడుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు.

### సీఐటీయూ ఆందోళన

శృంగవరపుకోట, మే 20 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా శృంగవరపుకోటలో సీఐటీయూ మంగళవారం ఆందోళన చేసింది. యూనియన్ మండల నాయకుడు మద్దిల రమణ ఆధ్వర్యంలో స్థానిక మహాత్మ గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వి.కన్నబాబు, పి.నాగరాజు, ఎం.అశోక్, ఎం.సత్యనారాయణ తదితరులున్నారు.

### మెరుగైన సేవలు అందించండి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

రాజాం, మే 20 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన సేవలు అందించాలని డీఎంహెచ్‌వో జీవనరాణి ఆదేశించారు. మంగళవారం మండలంలోని బొద్దాం పీహెచ్‌సీని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరై ఆసుపత్రికి వచ్చిన రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. పీహెచ్‌సీ వైద్యులు సబ్‌సెంటర్లను సందర్శించి ఏఎన్‌ఎంలు సకాలంలో విధులకు హాజరవుతున్నారో లేదో తనిఖీలు చేయాలన్నారు. పీహెచ్‌సీలో ప్రసవాలు ఎక్కువగా చేసేలా చర్యలు తీసుకోవాలని డా.సిద్ధేశ్వరిని ఆదేశించారు. అనంతరం రికార్డులు పరిశీలించి ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు.

### ఉపాధ్యాయ బదిలీలపై సానుకూలత



ఎమ్మెల్సీతో ఉపాధ్యాయ సంఘాల నేతలు

శృంగవరపుకోట రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీలలో పలు సంఘాల అభ్యర్థనలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు అన్నారు. మంగళవారం కోటమ్మతల్లి దర్శనానికి వచ్చిన ఆయన్ని పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇందుకూరి అశోక్‌రాజు ఆధ్వర్యంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు సమస్యలను ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల తరఫున ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్సీకి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కర్రి మోహన్‌రాజు, మధుమోహన్, కె.బంగారునాయుడు, చిప్పాడ సూరిబాబు, తమటపు అప్పారావు తదితరులున్నారు.

### చిన్నారి వైద్యానికి రూ.1.50 లక్షల సాయం



చెక్కు అందజేస్తున్న సొసైటీ ప్రతినిధులు

విజయనగరం దాసన్నపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): జామి మండలం కుమరాం గ్రామానికి చెందిన సరకాపు శంకర్, లత.. నగరంలోని బాలాజీ నగర్‌లోని అమ్మ సేవా సొసైటీ ప్రతినిధులను మంగళవారం కలిశారు. తమ కుమార్తె పూర్విక అనారోగ్యంతో బాధపడుతుందని తెలిపారు. ఆపరేషన్‌కు రూ.4 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారన్నారు. దాంతో సొసైటీ ప్రతినిధులు స్పందించారు. రూ.1.50 లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. సొసైటీ ఛైర్మన్ ఎన్.ఝాన్సీ లక్ష్మిబాయి, ఫౌండర్ ఎన్.సాంబశివరావు, సభ్యులు శాంతి, జయ తదితరులు పాల్గొన్నారు.

### జనసేనలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే

పూసపాటిరేగ, మే20 (ఆంధ్రజ్యోతి): మండలంలో కనిమెళ్ల గ్రామానికి చెందిన సుమారు 60 మంది ఎమ్మెల్యే లోకం నాగమాధవి సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. మంగళవారం భోగాపురంలోని ఎమ్మెల్యే నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో వారికి కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అదే గ్రామానికి చెందిన జనసేన నాయకుడు శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో చేరికలు జరిగాయి. కార్యక్రమంలో మండల జనసేన పార్టీ మండల అధ్యక్షుడు జలపారి శివ, మండల కో-ఆర్డినేటర్ జమరాజు, మహిళా నాయకురాలు బాసి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

### ఎక్కువ పనిదినాలు కల్పించండి: కళా

రాజాం, మే 20 (ఆంధ్రజ్యోతి): డ్వామా ఉద్యోగులు పారదర్శకంగా గ్రామాల్లో పనిచేసి ప్రజలకు సాధ్యమైనంత ఎక్కువ పనిదినాలు కల్పించాలని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకరావు ఆదేశించారు. మంగళవారం రాజాంలోని క్యాంపు కార్యాలయంలో డ్వామా పీడీ శారదాదేవి, నాలుగు మండలాల ఎంపీడీవోలతో ఆయన ఉపాధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఏయే గ్రామాల్లో 100 పనిదినాలు కల్పించారో అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశాలలో వేతనదారులకు ఇబ్బంది కలగకుండా టెంట్‌లు తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. చీపురుపల్లి నియోజకవర్గాన్ని జిల్లాలోని మొదటి స్థానంలో నిలిపేలా ఉద్యోగులు కృషి చేయాలన్నారు. సమీక్షలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు పాల్గొన్నారు.

### లేబర్ కోడ్‌లను రద్దు చేయండి



ఆందోళన చేస్తున్న కార్మికులు

విజయనగరం కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసే ఆలోచనలు విరమించుకోవాలన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పెట్రో ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం కార్మిక, రైతులు వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసులపై దాడులు చేస్తూ అటవీ ప్రాంతంలోని ఖనిజ సంపదను పెట్టుబడిదారులకు కట్టుబట్టేందుకు యత్నిస్తున్నారన్నారు. జిల్లాలోని మూతపడిన పరిశ్రమలు తెరిపించాలన్నారు. లేబర్ కోడ్‌ల రద్దుపై జూలై 9న తలపెట్టిన జాతీయ సమ్మెను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలోని టీవీ రమణ, సురేష్, శంకరరావు, లక్ష్మి, రెడ్డి శంకరరావు, సుధీర్, శ్రీను తదితరులు ఉన్నారు.

### నేడు జాబ్ మేళా

మెరకముడిదాం, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమలింగాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్టు మేళా నిర్వాహకుడు ఎస్.వెంకటపతిరాజు ఓ ప్రకటనలో తెలిపారు. డాక్టర్ రెడ్డీస్ ఎస్ఎంటీ మేళా చేపడుతోందన్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు మేళాకు హాజరు కావాలని ఆయన కోరారు.

### పోక్సో కేసులో వ్యక్తికి 20 ఏళ్ల జైలు

విజయనగరం క్రైం, మే 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2023లో నమోదైన పోక్సో కేసులో మంగళవారం శ్రీకాకుళం జిల్లా గార మండలం దీపావళి గ్రామానికి చెందిన ఉప్పెనవలస ఉమామహేశ్వరరావుకు 20 ఏళ్ల కఠిన కారాగారశిక్షతో పాటు రూ.2500 జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయాధికారి కె.నాగమణి తీర్పు వెల్లడించారని విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలో నివాసం ఉంటున్న 14 ఏళ్ల బాలిక 9వ తరగతి చదువుతున్న సమయంలో ఉప్పెనవలస ఉమామహేశ్వరరావుతో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి ఉమామహేశ్వరరావు ఫోన్‌లో మాట్లాడేవాడు. ప్రేమిస్తున్నానని బాలికను శ్రీకాకుళం తీసుకువెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. సదరు బాలిక టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ లక్ష్మణరావు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ బి.నాగేశ్వరరావు దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో అభియోగపత్రాన్ని దాఖలు చేశారు. ఉమామహేశ్వరరావు నేరం రుజువు కావడంతో న్యాయాధికారి తీర్పు ఖరారు చేశారని డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు.

### యువకుడిపై పోక్సో కేసు నమోదు

నెల్లిమర్ల, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రేమ, పెళ్లి పేరిట బాలికను శారీరకంగా లొంగదీసుకుని మోసం చేసిన మండలంలోని కొండవెలగాడ గ్రామానికి చెందిన పి.నారాయణ(25)పై నెల్లిమర్ల పోలీసులు మంగళవారం పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నారాయణకు ఇదే మండలంలోని ఓ గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలికతో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని ఆ బాలికను నమ్మించి గర్భవతిని చేసి ఆ తర్వాత అబార్షన్ చేయించాడు. పెళ్లికి ససేమిరా అనడంతో నెల్లిమర్ల పోలీసులను బాలిక ఆశ్రయించింది. దాంతో నెల్లిమర్ల పోలీసులు నారాయణపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### గొర్రెల కాపరి మృతి

మక్కువ, మే 20 (ఆంధ్రజ్యోతి): వడదెబ్బతో గొర్రెల కాపరి మృతిచెందిన ఘటన మండలంలోని దబ్బగెడ్డ సమీపంలో మంగళవారం చోటు చేసు కుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోన గ్రామానికి చెందిన పోలయ్య(42) గొర్రెలు మేపడానికి దబ్బగెడ్డ గ్రామ సమీపంలోకి మంగళ వారం తీసుకుని వెళ్లారు. సాయంత్రం గొర్రెలు ఇంటికి చేరినా పోలయ్య రాలేదు. దీంతో కుటుంబీకులు వెతకగా దబ్బగెడ్డ గ్రామ సమీపంలో కుప్పకూలి ఉన్నారు. పోలయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్థానిక వీ ఆర్వో తెలిపిన వివరాల ప్రకారం కలెక్టరేట్‌కు సమాచారం పంపించినట్టు తహసీల్దార్ షేక్ ఇబ్రహీం తెలిపారు.



పోలయ్య (ఫైల్)

## రోడ్డుపైనే మురుగునీరు

**●స్థానికులు, వాహనదారులకు తప్పని ఇబ్బందులు ●రాజాం ప్రధాన రహదారిలో ఇదీ దుస్థితి**



రోడ్డుపై నిలిచిన మురుగునీరు

రాజాం, మే20 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజాం- శ్రీకాకుళం ప్రధాన రహదారిలో మురుగునీరు ప్రవహిస్తోంది. దీంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రహదారిలో ప్రధాన కాలువ నిర్మాణం పూర్తిస్థాయిలో చేపట్టకపోవడమే ఇందుకు కారణం. స్థానికులు ఈ విషయంపై పలుమార్లు ఫిర్యాదు చేసినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదు. కనీసం చర్యలు తీసుకోకపోవడంతో వర్షం కురిస్తే మురుగునీరు రోడ్డును ముంచెత్తుతోంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి మురుగు కాలువను పూర్తిస్థాయిలో ఏర్పాటుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు మాట్లాడుతూ డ్రైనేజీలో పూడికలు తీయించి మురుగునీరు రోడ్డుపైకి రాకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



రోడ్డు వెంబడి ఇలా..

# అంబరాన్నంటిన సంబరం

(ఐదో పేజీ తరువాయి)

గంటలకు మొదలు కావాల్సిన సిరిమానోత్సవం రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది. నాయుడువీధి నుంచి శివాజీ బొమ్మ జంక్షన్ దాటిన వెంటనే అంజలి రథం చక్రం విరిగిపోయింది. దీంతో సిరిమాను సంబరం కొంతసేపు నిలిచింది. మళ్లీ రథానికి వేరే చక్రం తెచ్చి అమర్చడం తో సిరిమానోత్సవం మళ్లీ కొనసాగింది. 15 ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్న పండగ కావడంతో ఉత్తరాంధ్ర, కోస్తా ఆంధ్ర, ఒడిశా, రాయిపూర్, బిలాయ్, ఛత్తీస్‌గఢ్ నుంచి భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు. అధికారులు పది లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేయగా, అంతకు మించి వచ్చారు. వారిని నియంత్రించేందుకు పోలీసులు చాలా కష్టపడ్డారు. తప్పెటగుళ్ల, తీన్‌మార్, చోడవరం డ్రమ్ములు, బిందెల డ్యాన్స్, పులివేషాలు, సాము గరిడీలు, కాంతార, బండ్ల వేషాలు, గిరిజన థింసా నృత్యం ఎంతగానో అలరించాయి. వీటిని చూసేందుకు ప్రజలు పోటీ పడ్డారు. కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ దంపతులు, జిల్లాకు చెందిన పలువురు అధికారులు, ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఉత్సవ కమిటీ, దేవదాయ ధర్మదాయశాఖ అధికారులు ఎప్పటికప్పుడు భక్తుల సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించడంతో ఉత్సవం ముందుకు సాగింది. స్వచ్ఛంద సేవా సంఘాలు పలు సేవలు అందించాయి.

# తెలిసినా తెలియనట్టు!

(ఐదో పేజీ తరువాయి)

పడిన వర్షాలు, ఆ తరువాత తుఫాన్‌లు, వాయుగుండాల ప్రభావంతో కురిసే వర్షాలకు చెరువులు, వాగుల్లో చేరే నీటితోనే పంటలు పండుతాయి. అయితే ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాగు భూమికే ఈ నీరు సక్రమంగా అందడం లేదు. ఖరీఫ్ వరి పండించేందుకు రైతులు నీటికోసం ఏటా నానా తంటాలు పడుతున్న విషయం తెలిసిందే. నీటి కోసం చెరువుల్లో ఇంజన్‌లు పెట్టి తోడుకుంటున్నారు. దీనికి కారణం కొండల్లో పడిన వర్షపు నీరు వచ్చే గెడ్డలు చాలా వరకు ఆక్రమణల్లో ఉన్నాయి. పైనున్న భూయజమానులు వాటి రూపు రేఖలను మార్చేశారు. చెరువులు, బందల గర్భాలను కప్పేసారు. కొన్ని చోట్ల రియల్ ఎస్టేట్‌గా మారిపోయాయి. కనీసం ఇప్పుడున్న సాగునీటి వనరులనైనా కాపాడుకుంటే పంటల విస్తీర్ణం తగ్గకుండా ఉంటుంది. ప్రధానంగా సాగునీటి వనరుల ఆక్రమణలను అడ్డుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

# బహిరంగ చర్చకు సిద్ధమా?

● పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

బెలగాం, మే 20 (ఆంధ్రజ్యోతి): తనపై చేసిన ఆరోపణలపై బహిరంగ చర్చకు సిద్ధమా.. అని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర.. మాజీ ఎమ్మెల్యే జోగారావుకు సవాల్ విసిరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో దోచుకోవడం, దాచుకోవడమే ధ్యేయంగా మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పని చేశారన్నారు. అవినీతి అనకొండ అయిన జోగారావు తనపై తప్పుడు ప్రచారాలు చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లేనని ఎద్దేవా చేశారు. బదిలీలలో వసూళ్లకు పాల్పడుతున్నానని తప్పుడు ఆరోపణలు చేసిన ఆయన నిరూపించాలన్నారు. ఆయన చేసిన అక్రమాల చిట్టా తన దగ్గర ఉందని వాటిని మీడియా ముందు పెడుతున్నానని, దమ్ముంటే తనపై చేసిన ఆరోపణలను నిరూపించాలన్నారు. మీడియా సాక్షిగా బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. 2014లో రూ.30 లక్షలు, 2019లో రూ.2 కోట్లు, 2024లో రూ.6 కోట్లు అని అఫడవిట్ సమర్పించారని, కానీ ఆయన పేరున రూ.150 కోట్ల మార్కెట్ వాల్యూతో దస్తావేజులు ఉన్నాయని వెల్లడించారు. వాటికి సంబంధించిన కాగితాలు మీడియాకు చూపించారు. తాను మూడు నెలలుగా తహసీల్దార్‌పై రెవెన్యూ ట్యాంపరింగ్ చేయాలని ఒత్తిడి తెచ్చినట్టు మాజీ ఎమ్మెల్యే ఆరోపించారని, అది అవాస్తవమని, ఫేక్ పట్టాలు సృష్టించడంలో ఆయనకు మించినవారు లేరన్నారు. నిరాధార ఆరోపణలు మానుకోవాలని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొట్టాపు వెంకట నాయుడు, బోను చంటి, రౌతు వేణు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## సారా రహిత గ్రామాలే లక్ష్యం

సీతానగరం, మే 20 (ఆంధ్రజ్యోతి): నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సారా రహిత గ్రామాలను తీర్చిదిద్దడమే లక్ష్యమని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ డి.పద్మావతి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్ అధ్యక్షతన సారా నిర్మూలన కమిటీ సభ్యులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సారా తయారు చేసినా, విక్రయించినా, విక్రయాలను ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సివిల్ పోలీసులు, స్థానిక సంస్థ ప్రజాప్రతినిధులు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన కల్పించాలి

బలిజిపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతపై ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, చట్టాలపై కిశోర బాలికలకు అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ పీడీ టి.కనకదుర్గ సూచించారు. మిర్తివలస అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోరీ వికాసం శిక్షణా కార్యక్రమంలో భాగంగా నేడు బాలికల కోసం అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, చట్టాలపై వివరించాలన్నారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. బలిజిపేట ప్రాజెక్టు అధికారి సులేఖ, సూపర్‌వైజర్ పద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## టీడీపీలో చేరిక

గరుగుబిల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు గ్రామానికి చెందిన పలువురు వైసీపీ ప్రతినిధులు టీడీపీలో చేరారు. మంగళవారం గుమ్మలక్ష్మీపురంలో నిర్వహించిన మినీ మహానాడు కార్యక్రమంలో కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఆరేటి మహేష్ బాబు సమక్షంలో వీరు పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో పెద్దింటి శ్రీధర్, యేగిరెడ్డి సింహాచలంనాయుడు, ద్వారపురెడ్డి భాస్కరరావు, పెద్దింటి శ్రీరామ్మూర్తి తదితరులు ఉన్నారు. పార్టీ ప్రతినిధులు ఎం.పురుషోత్తంనాయుడు, ఎ.మధుసూదనరావు, అంబటి రాంబాబు, ఎం.తవిటినాయుడు, నారాయణస్వామి, లక్ష్మణరావు, డి.రామచంద్రనాయుడు పాల్గొన్నారు.

## తుప్పలను తొలగించాలి

పాలకొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 6, 7 వార్డుల మధ్యలో ఉన్న తోటపల్లి కాలువలో తుప్పలు, డొంకలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బుడితి అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. తుప్పలను తొలగింపజేయాలని కోరుతూ నగర కమిషనర్ రత్నరాజుకు వినతిపత్రం అందించారు.

## ఉపాధి పనుల పరిశీలన

సీతానగరం, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశీపేట, అంటిపేట గ్రామాల చెరువుల్లో చేపడుతున్న ఉపాధి పనులను ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. వేతనదారుల మస్తర్లను తనిఖీ చేశారు. వేతనదారులకు పనికి తగిన వేతనాలను వచ్చే విధంగా టెక్నికల్ అసిస్టెంట్లు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● ఘనంగా మినీ మహానాడు



గుమ్మలక్ష్మీపురం: మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి, వేదికపై పార్టీ నాయకులు



బొబ్బిలి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబీనాయన

గుమ్మలక్ష్మీపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే టీడీపీ లక్ష్యమని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మంగళవారం గుమ్మలక్ష్మీపురంలో కురుపాం నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా దివంగత నేత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల కోసం నిరంతరం పరితపించే ఏకైక నాయకుడు నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈసందర్భంగా నియోజకవర్గ పరిధిలోని 14 అంశాలను తీర్మానం చేశారు. కురుపాం నియోజకవర్గ పరిశీలకుడు ఆరేటి మహేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యేను వేదికపై సన్మానించారు.

● బొబ్బిలి రూరల్: టీడీపీకి పునాది, బలం, శక్తి, కార్యకర్తలేనని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. బొబ్బిలి కోటలో మంగళవారం మినీ మహానా డు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల లు వేసి, నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బుడా ఛైర్మన్ తెంటు లక్ష్మునాయుడు, మున్సిపల్ ఛైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, టీడీపీ పట్టణ అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు అల్లాడ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

# 15 నుంచి 'ఉత్కర్ష్ అభియాన్'పై ప్రచారం

పార్వతీపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): ధర్తీ ఆబాజన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ అవగాహన కార్యక్రమాలు జూన్ 15 నుంచి జూన్ 30 వరకు నిర్వహిస్తామని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారత ప్రభుత్వం ప్రధానమంత్రి జన్ జాతి ఆదివాసీ న్యాయ మహాభియాన్ ధర్తీ ఆబాజన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కార్యక్రమాలను త్రికరణ శుద్ధితో అమలు చేయడానికి కృషి చేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా గిరిజన ప్రాంతాల్లో సేవలు, మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. సంప్రదాయ ప్రచారాల మాదిరిగా కాకుండా ఈ ప్రచారం గ్రామ, క్లస్టర్ స్థాయి శిబిరాలు ద్వారా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేలా చూస్తున్నారని ఆయన తెలిపారు. ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, ఆయుష్మాన్ భారత్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం, కిసాన్ క్రెడిట్ కార్డు, జన్‌ధన్‌ఖాతా, బీమా కవరేజ్, సామాజిక భద్రత, ఉపాధి, జీవనోపాధి పథకాలు, పీఎం విశ్వకర్మ, ముద్ర రుణాలు, స్త్రీ, శిశు సంక్షేమం, ప్రయోజనాలు తదితర సేవలు అందిస్తారని తెలిపారు. ఆరోగ్యం, ఆహారం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సామాజిక న్యాయం, వ్యవసాయం, రెవెన్యూ ఇతర విభాగాల సమన్వయంతో ప్రచార కాలంలో తదితర కార్యకలాపాలు చేపడతారని వివరించారు. ఆధార్, ఈకేవైసీ డాక్యుమెంటేషన్ సంబంధిత సేవల కోసం సంబంధిత విభాగాలు పనిచేస్తాయన్నారు. ఈ ప్రచారం విజయవంతం కావడానికి సహకరించాలని గిరిజన సంక్షేమ శాఖకు సూచించామని తెలిపారు.

## ప్రభుత్వ విధానాలపై పోరాడుదాం

సీతానగరం, మే 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు నిర్వహించాలని మండల వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 9న జరగబోయే దేశ వ్యాప్త సమ్మెలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి గవర వెంకటరమణ, అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి జి.జ్యోతిలక్ష్మి, రైతు సంఘం జిల్లా నాయకులు బి.అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు. ● పాలకొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ, రైతు వ్యతిరేక విధానాలు ఆపాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కోటదుర్గమ్మ ఆలయం వరకు భారీ ర్యాలీ, మానవహారం చేపట్టారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత కార్మిక చట్టాలన్నింటినీ రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు జూలై 9న చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని ఆయన కోరారు. సీఐటీయూ, అంగన్‌వాడీ, మధ్యాహ్న, ఆశ, రైస్‌మిల్లు, మార్కెట్ కళాసీ యూనియన్, భవన నిర్మాణ, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

## కనీస వేతనాలు చెల్లించాలి

● 102 సర్వీస్ ఉద్యోగుల ఆందోళన




కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న 102 ఉద్యోగులు

బెలగాం, మే 20 (ఆంధ్రజ్యోతి): తమకు కనీస వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్(102) సర్వీస్‌లో పనిచేస్తున్న కెప్టెన్లు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట వారు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం జేసీ శోభితకు వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా సీఐటీయూ నాయకుడు బీవీ రమణ మాట్లాడుతూ ప్రజలకు ఎంతో ఉపయోగపడే తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్(102) సర్వీస్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు వేతనాలు సకాలంలో చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## కాలువల్లో పూడికలు తొలగించాలి

● బొబ్బిలి మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి



కాలువను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

బొబ్బిలి రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): కాలువల్లో ఎప్పటికప్పుడే పూడికలు తొలగించాలని బొబ్బిలి మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని బలిజిపేట రోడ్డు, నాగాశపు వీధి, పాకీ వీధి, కోరాడ వీధి తదితర ప్రాంతాల్లో ఆమె మంగళవారం పర్యటించారు. బలిజిపేటరోడ్డు, నాగాశపు వీధిలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఖాళీ స్థలాల్లో చెత్త లేకుండా చూడాలని, కాలువల్లో పూడికలు తొలగించాలని ఆమె సిబ్బందికి ఆదేశించారు. కోరాడ వీధిలోని కాలువలను పరిశీలించి, వాటిలో పూడికలు తొలగించి నీరు ప్రవహించే విధంగా చూడాలని శానిటరీ సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## నెల రోజులపాటు యోగాంధ్ర నిర్వహించాలి



వీసీలో పాల్గొన్న ఆర్డీవో రామ్మోహనరావు

బొబ్బిలి రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): యోగా దినోత్సవంపై జేసీ సేతుమాధవ్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, బొబ్బిలి ఆర్డీవో కార్యాలయంలో అధికారులు వీక్షించారు. జూన్ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జయప్రదం చేసేందుకు ఆయన అధికారులకు పలు సూచనలిచ్చారు. నెల రోజులపాటు యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జీవీఎస్ఎస్ రామ్మోహనరావు, తహసీల్దార్ ఎం.శ్రీను, ఎంపీడీవో పి.రవికుమార్, డిప్యూటీ ఎంపీడీవో అల్లు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

# పేరుకుపోతున్న చెత్త కుప్పలు

● ఇబ్బంది పడుతున్న మహారాణిపేట వాసులు



మహారాణిపేట సమీపంలో పేరుకుపోయిన చెత్త

బొబ్బిలి రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపాలిటీ పరిధి మహారాణీపేట అభయ వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే దారిలో రహదారి పక్కనే కుప్పలు కుప్పలుగా చెత్త పేరుకుపోతోంది. ఆలయానికి వెళ్లే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. స్థానికులు దుర్వాసన భరించలేక, అసౌకర్యానికి గురవుతున్నారు. దీనిపై సంబంధిత మున్సిపల్ అధికారులు దృష్టి సారించి ఈ చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలని కాలనీవాసులు కోరుతున్నారు. ● ఈ విషయంపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళిని వివరణ కోరగా.. అక్కడ చెత్త వేయడానికి అనుమతి లేదని, పరిశీలించి తొలగించే ఏర్పాటు చేయిస్తానని తెలిపారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు చేయొద్దు

బొబ్బిలి రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారిత పరీక్షల నిరోధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని ఆర్డీవో రామ్మోహనరావు అన్నారు. మంగళవారం బొబ్బిలి ఆర్డీవో కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో లింగ నిర్ధారిత పరీక్షల నిరోధ చట్టం అమలుపై డివిజనల్ స్థాయి వైద్యాధికారులతో సమీక్షా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఆ చట్టం అమలుపై తీసుకుంటున్న చర్యలు, ప్రస్తుతం తీసుకోవాల్సిన చర్యలపై వైద్యాధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో పలువురు వైద్యాధికారులు మాట్లాడుతూ లింగ నిర్ధారిత పరీక్షల నిరోధ చట్టంను కఠినంగా అమలు చేయడం ద్వారా ఆడ శిశువుల భ్రూణ హత్యలు నిరోధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ స్థాయి వైద్యాధికారులు పాల్గొన్నారు.



## తాగునీరు వృథా

● లీకులను సరిచేయని వైనం



నుంకి సమీపంలో ప్రధాన పైపులైన్ లీకవుతున్న దృశ్యం

గరుగుబిల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ప్రాజెక్టు నుంచి పార్వతీపురం మున్సిపాలిటీకి సరఫరా అవుతున్న పైపులైన్ లీకులకు గురవుతోంది. గత కొన్నాళ్లుగా నుంకి సమీపంలోని ఐటీడీఏ బోటు షికారు ప్రాంతంలో, అలాగే తోటపల్లి కుడి ప్రధాన కాలువను ఆనుకుని ఉల్లిభద్ర ప్రాంతంలో తాగునీరు వృథాగా పోతుంది. ప్రధానంగా నుంకి ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న పైపులైన్ నుంచి లీకులకు గురవుతున్న నీటిని పలువురు ఉపయోగించుకుంటున్నారు. అలాగే పంట పొలాలకు చేరుతుంది. బోటు షికారు ప్రాంతంలో వంట చేసుకునేందుకు, బట్టలను ఉతికేందుకు ఉపయోగించుకుంటున్నారు. దుకాణదారులు తాగునీటి కోసం ఉపయోగించుకుంటున్నారు. పట్టణంలో తాగునీటికి ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. పూర్తిస్థాయిలో తాగునీరు అందించే ప్రధాన పైపులైన్ మరమ్మతులు నెలకొన్నా దృష్టి సారించని పరిస్థితి ఏర్పడింది. సంబంధిత అధికారులు పైపులైన్‌ను పరిశీలించి లీకులను అరికట్టే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

# తొట్టెల్లో నీరేదీ?

● నీరుగారుతున్న లక్ష్యం



బిటివాడలో ఖాళీగా ఉన్న పశువుల తొట్టె

వీరఘట్టం, మే 20 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో పశువుల దాహార్తిని తీర్చేందుకు మండలంలోని 20 నీటితొట్టెలు మంజూరయ్యాయి. ఒక్కొక్క నీటి తొట్టె నిర్మాణానికి రూ.32వేలు చొప్పున నిధులు మంజూరయ్యాయి. మండలంలో ఇప్పటివరకు 17 నీటితొట్టెల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఈ తొట్టెలలో నీరు నింపి పశువుల దాహార్తిని తీర్చాల్సి ఉంది. కానీ వాటిలో నీరు నింపకపో వడంతో లక్ష్యం నీరుగారుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పశువుల నీటి తొట్టెల లో నీరు నింపి పశువుల దాహార్తిని తీర్చాలని పలువురు కోరుతున్నారు.

## న్యూస్ బాక్స్

### నేడు మహానాడు

పాలకొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీఎల్ నాయుడు కల్యాణ మండపంలో బుధవారం ఉదయం 9 గంటలకు మినీ మహానాడు నిర్వహిస్తున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు, బీసీ తూర్పుకాపు రాష్ట్ర డైరెక్టర్ గండి రామినాయుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిశీలకులు హర్షవర్ధన్, కలమట సాగర్ హాజరవుతారని వారు తెలిపారు. ఈసందర్భంగా నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు అందరూ ఈ కార్యక్రమానికి హాజరై, విజయవంతం చేయాలని వారు ఆ ప్రకటనలో కోరారు.

### రోగులకు పండ్లు పంపిణీ

బొబ్బిలి రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా మంగళవారం బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రిలో నందమూరి యువసేన ఆధ్వర్యంలో మున్సిపల్ ఛైర్మన్ రాంబార్కి శరత్ బాబు చేతులమీదుగా రోగులకు పండ్లు, రొట్టె పంపిణీ చేశారు. నందమూరి యువసేన సభ్యులు పితాని శ్రీనివాసరావు, పడాల శ్రీను, సత్యనారాయణ పాల్గొన్నారు.

### స్తంభించిన ట్రాఫిక్

బొబ్బిలి రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): సాలూరు గ్రామ దేవత శ్యామలాంబ పండుగ సందర్భంగా వాహనాల రాకపోకలు పెరగడంతో మంగళవారం బొబ్బిలి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ట్రాఫిక్ స్తంభించింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనంతరం ట్రాఫిక్ పోలీసులు స్పందించి ట్రాఫిక్‌ను నియంత్రించారు.

### టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా గెంబలి

బొబ్బిలి రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బొబ్బిలి పట్టణం అధ్యక్షుడిగా గెంబలి శ్రీనివాసరావుని నియమించినట్టు ఎమ్మెల్యే బేబీనాయన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం శ్రీనివాసరావు ఆరో వార్డు కౌన్సిలర్‌గా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా సేవలందిస్తున్నారు. మొదటి నుంచి రాజుల అభిమానిగా ఉన్న ఈయన మున్సిపల్ ఛైర్మన్‌గా ఎన్నికవుతారని అందరూ ఊహించినప్పటికీ, కొన్ని రాజకీయ సమీకరణాల వల్ల ఆ పదవి రాంబార్కి శరత్‌బాబును వరించింది. అయితే శ్రీనివాసరావు పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించి, ఎమ్మెల్యే ఆయనను టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా నియమించారు.